క్లుప్తంగా

'రెవెన్యూ శాఖ పట్టాలు ఇవ్వదు'

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని చెరువు శిఖం భూమి ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదని, ఇరిగేషన్ ల్యాండ్‌లో రెవెన్యూ శాఖ పట్టాలు ఇవ్వదని ఎడపల్లి తహసీల్దార్ ఆకుల శేఖర్ స్పష్టం చేశారు. శిఖం భూమిలో పట్టాల కోసం గ్రామస్తులు విజ్ఞప్తి చేశారని ఆయన అన్నారు. పట్టాలు ఇప్పిస్తామని కొంత మంది నాయకులు నెహ్రూనగర్ గ్రామస్తులును మభ్య పెడుతున్నారని ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని సూచించారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నిజామాబాద్ నగరానికి చెందిన శీను నాయక్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణుడు శీను నాయక్ పాఠశాలు చెందిన 92 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి టూత్ పేస్టులు అందజేశారు. అలాగే దంతాల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల హెచ్ఎం మాధవ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటర్న్ ఏర్పాటు చేయండి

రుద్రూర్ (మోస్రా): మోస్రా మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న డివైడర్ పనులను శుక్రవారం బాపనయ్య నగర్ వద్ద స్థానికులు అడ్డుకున్నారు. బాపనయ్య కాలనీకి సమీపంలో యూటర్న్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై అనిల్ రెడ్డి వచ్చి కాలనీవాసులతో మాట్లాడారు. పనులను నిలిపివేయవద్దని, సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

పాఠశాలలో మాక్ అసెంబ్లీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం అసెంబ్లీ నిర్వహణ, వివిధ శాఖల మంత్రుల విధులు, ప్రతిపక్షం అడిగే ప్రశ్నలకు అధికార పక్షం ఇచ్చే సమాధానాలు, ప్రజాస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జీపీ భవనం ప్రారంభం

మాక్లూర్: వల్లభాపూర్‌లో నిర్మాణం పూర్తయిన జీపీ భవనాన్ని శుక్రవారం సర్పంచ్ మంజుల ప్రారంభించారు. నూతన పంచాయతీ భవన నిర్మాణానికి 2 సంవత్సరాల క్రితం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో భవన నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా కొన్ని చిన్నా చితక పనులు చేయాల్సి ఉంది. నిధులు లేకవటంతో ఆ పనులు పెండింగ్‌లో పడ్డాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పి గంగాధర్, ఎంపీటీసీ కారం సుజాత, బీఆర్ఎస్ నాయకులు శిలారి సుధాకర్, హన్మంత్‌రావు పాల్గొన్నారు.

'టాయిలెట్స్'కు భూమిపూజ

నందిపేట్ (ఆర్మూర్):మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం కోసం శుక్రవారం ఎంపీపీ వాకిటి సంతోష్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్రం యమున, సర్పంచ్ సాంబార్ వాణి, ఉపసర్పంచ్ భరత్ పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థులు శుక్రవారం హెచ్‌సీఎల్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని నాగారం గురుకుల కళాశాలలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో విద్యార్థులు మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్, తదితర అంశాలపై ఆన్‌లైన్ పరీక్ష రాశారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చిన్న వయసులోనే సాంకేతిక రంగంలో స్థిరపడే అవకాశం ఉంటుందని ప్రిన్సిపల్ సయ్యద్ హైదర్, అసిస్టెంట్ కెరీర్ కౌన్సిలర్ హస్నత్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి తెలిపారు. ఈ నెల 3న 20 మంది క్రీడాకారులను ఎంపిక చేసి శిక్షణ అందించారు. అందులో ప్రతిభ కనబర్చిన ఆర్మూర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు విద్వాన్, కార్తీక్, చందు, లక్ష్మణ్, వివేక్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడకారులను వైస్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి అభినందించారు

ఇంటింటికి తెలుగుదేశం

నందిపేట్ (ఆర్మూర్): ప్రజల కోసం, ప్రగతి కోసం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నందిపేట మండల కేంద్రంలో తెలుగుదేశం నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు దంతారా ఆనంద్ అన్నారు. రాష్ట్ర బీసీ నాయకులు జ్యోతి, నారాయణ, లక్ష్మీనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి జీవితం ఆదర్శం

మహిళల విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమ కారిణి, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. – సాక్షినెట్‌వర్క్



గోవింద్‌పేట్‌లో సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మెప్మా యాక్టివిటీస్ సొసైటీ డైరెక్టర్ అశోక్



బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



వేల్పూర్: రామన్నపేట్‌లో ..



వర్ని సీపీఎం కార్యాలయంలో..

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్



వీడ్కోలు వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

- బోధన్ ఆర్డీవో రాజేశ్వర్
- కల్దుర్కి జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

బోధన్: పాఠశాల దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదల, క్రమ శిక్షణతో చదవాలని, కష్టపడేతత్వం అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ విద్యార్థులకు సూచించారు. సంకల్పంతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతమైన మౌలిక సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. తాను ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే ఉన్నత విద్యను అభ్యసించానని తెలిపారు. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కల్దుర్కి జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో, ఏసీపీ కిరణ్ కుమార్‌లు హాజరై విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ సర్పంచ్ నారాయణ పటేల్, పాఠశాల హెచ్ఎం ఇల్తెపు శంకర్, ఎస్ఎంసీ చైర్మన్ సాయిలు, సొసైటీ చైర్మన్ శరత్, ఎంపీటీసీ లక్ష్మీరాజన్న పాల్గొన్నారు.

జిల్లా దీక్షలకు కాంగ్రెస్ మద్దతు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన దీక్షలకు కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్‌లు మద్దతు తెలిపారు. శుక్రవారం న్యాయవాదుల దీక్షా శిబిరాన్ని వారు సందర్శించారు. ప్రత్యేక జిల్లా కోసం న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 82వ రోజుకు చేరాయి. దీక్షలో పట్టణ వాసులు భూమయ్య, ఆశ్రఫ్‌లు కూర్చున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రుద్రూర్: అక్బర్‌నగర్‌లో జెడ్పీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం జెడ్పీటీసీ నరోజి గంగారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్బర్‌నగర్‌లో సీసీ రోడ్లకు రూ.10 లక్షలు కేటాయించినట్టు వెల్లడించారు. అలాగే గ్రామంలో రూ.40లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగుళ్ల గంగామణి ప్రసాద్, ఉప సర్పంచ్ రంజిత్, ఏఎంసీ మాజీ చైర్మన్ సంజీవులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న బోధన్ డీఎం స్వామి

రుద్రూర్: ప్రజల కోసమే ఆర్టీసీ పని చేస్తోందని, ఆర్టీసీ అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని బోధన్ డిపో మేనేజర్ టీఎస్ స్వామి కోరారు. రుద్రూర్ బస్టాండ్‌లో శుక్రవారం బోధన్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అనంతరం డీఎం మాట్లాడుతూ..బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రయాణికుల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. పోతంగల్ ప్రజల వినతి మేరకు బోధన్ నుంచి బీర్కూర్, బిచ్కుంద, పిట్లం మీదుగా పటాన్‌చెరు (లింగంపల్లి) బస్సును కొత్తగా ప్రారంభించినట్లు తెలిపారు. ఎంవీఐ యశ్వంత్ కుమార్, సీఐ జనాబాయి, సీఆర్‌పీ సందీప్ గౌడ్, డీఐ రెహ్మాన్ ఉన్నారు.

ఢిల్లీ దీక్షలో బోధన్ మహిళా నేతలు



బోధన్: భారత జాగృతి అధ్యక్షులు, జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద చేపట్టిన ఒక్క రోజు నిరాహార దీక్షలో బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డిలు పాల్గొన్నారు. ఆమెకు మద్దతుగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



పచ్చలనడ్కుడలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం సురేశ్



రెంజల్ ఆస్పత్రిలో మహిళా సిబ్బందికి సన్మానం

వేల్పూర్: పచ్చలనడ్కుడ ప్రైమరీ స్కూలులో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమని స్థానిక హైస్కూలు హెచ్ఎం సురేశ్ అన్నారు.

రెంజల్ ఆస్పత్రిలో..

రెంజల్(బోధన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కావ్యతో పాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. మహిళా సిబ్బంది అందిస్తున్న సేవలకు గుర్తింపు లభిస్తుందని డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రావణ్ కుమార్, కరిపే రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

వేల్పూర్: వేల్పూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్సెస్సీ విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఇతర తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠాలు బోధించిన విద్యార్థుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. హెచ్ఎం రాజన్న, పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు గంట అశోక్ పాల్గొన్నారు.

కెపాసిటర్లను బిగించుకోవాలి

- ఏడీఈ లక్ష్మణ్ నాయక్

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి ట్రాన్స్‌కో సబ్ డివిజన్ పరిధిలోని ఎడపల్లి, రెంజల్, బోధన్ రూరల్ మండలాల్లోని రైతులు తమ వ్యవసాయ పంపు సెట్ల వద్ద బిగించుకున్న ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించి బోరు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ఎడపల్లి ఏడీఈ లక్ష్మణ్ నాయక్ సూచించారు. దీని వల్ల వ్యవసాయ పంపుసెట్లకు సేఫ్టీతో పాటు విద్యుత్ ఆదా అవుతుందన్నారు. శుక్రవారం ఏడీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మోటార్లకు బిగించుకునే కెపాసిటర్లు మార్కెట్లో రూ.300 నుంచి 400 లోపు మార్కెట్లో లభ్యమవుతాయని చెప్పారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించడానికి ఎడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాలలో అధికారులు ప్రతి మండలానికి రెండేసి గ్రామాలను దత్తత తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

ప్రైవేటు బడులకు మెమో జారీ

పెర్కిట్(ఆర్మూర్): శ్రీ భాషిత, శ్రీ చైతన్య పాఠశాలలకు మెమోలు జారీ చేసినట్లు ఎంఈవో రాజ గంగారం శుక్రవారం తెలిపారు. విద్యార్థులను సమయానికి మించి స్టడీ అవర్స్ పేరుతో మానసిక క్షోభకు గురిచేయడంతో పాటు ఫీజుల చెల్లింపు విషయంలో పాఠశాల ఆవరణలో నిలబెట్టి శిక్షిస్తున్నారని తల్లితండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదు వచ్చిందన్నారు. దీంతో ఆయా పాఠశాలలకు మెమోలు జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు.

క్రీడా దుస్తుల అందజేత



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి అల్ఫోర్స్(నరేంద్ర) హైస్కూల్‌లో శుక్రవారం 37వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పది జిల్లాలకు చెందిన జట్లు క్రీడా ప్రాంగణానికి చేరుకున్నాయి. శనివారం నుంచి జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా నిజామాబాద్ జట్టు క్రీడాకారులకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ హడక్ కమిటీ జిల్లా చైర్మన్ గంగా మోహన్ చక్రు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్, కో కన్వీనర్ రాజేష్, కార్యదర్శి నరేంద్ర చారి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యా సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

బీమాపై అవగాహన కల్పించాలి



నవీపేట: అక్షరాస్యత, ఆవశ్యకతతో పాటు బీమాపై గ్రామీణ ప్రాంతాలలో ఖాతాదారులకు అవగాహన కల్పించాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఎల్‌డీఎం) శ్రీనివాస్ రావు సూచించారు. నవీపేట, రెంజల్, ఎడపల్లి మండలాలకు చెందిన బ్యాంకర్లతో ఆయన శుక్రవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులకు ఉపాధి నిమిత్తం రుణ సదుపాయం కల్పించాలని సూచించారు. అర్హత కలిగిన మహిళా సంఘాలన్నింటికి రుణాలు ఇవ్వాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, నవీపేట, రెంజల్, ఎడపల్లి మండలాల బ్యాంకర్లు పాల్గొన్నారు.

దేశ రక్షణ కోసం పోరాడిన వ్యక్తి శివాజీ



ఎడపల్లి(బోధన్): తుల్జాభవాని అమ్మవారు ఇచ్చిన ఖడ్గంతో దేశ సంరక్షణ కోసం పోరాటం చేసిన వ్యక్తి ఛత్రపతి శివాజీ మహరాజ్ అని బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. జాన్కంపేట్‌లో యువత, గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత ఆయన మాట్లాడారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. యువతలో ఛత్రపతి శివాజీ భావజాలం ఉండాలని పిలుపునిచ్చారు. శివాజీ విగ్రహం ఏర్పాటు చేసిన యువకులను అభినందించారు.

అటెన్షన్ ప్లీజ్..

తవ్వి వదిలేశారు



రుద్రూర్ రాజేశ్వరాలయం ఎదుట తవ్వి వదిలేసిన దృశ్యం

మండల కేంద్రంలోని రాజరాజేశ్వర ఆలయం ఎదుట డ్రైనేజీ నిర్మాణానికి తవ్వకాలు జరిపి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణానికి వ్యతిరేకత రావడం వల్ల పనులు నిలిపివేశారు. మూడు నెలలుగా సమస్య కొలిక్కి రావడం లేదు. పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు. – రుద్రూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: బాల గంగాధర్, ఎంపీడీవో

ఫోన్ నంబర్: 77995 03111

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్‌లో కంటి అద్దాలను అందజేస్తున్న కౌన్సిలర్



మిర్దాపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సొడ సాయిలత



రాయకూర్‌లో.. సర్పంచ్ గంగారాం

ఆర్మూర్‌టౌన్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ ఇంతియాజ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 14, 32వ వార్డుల్లో కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, మందులు అందజేస్తామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఫయాజ్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, సానిటరీ ఎస్సై మహేష్, వార్డు అధికారి చక్రధర్ పాల్గొన్నారు.

ఆలూరు మండలం మిర్దాపల్లిలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లిలో శుక్రవారం కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ సొడ సాయిలత, ఉప సర్పంచ్ సొడ మధువర్మ ముఖ్య అతిథులుగా హాజరై కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. దేగాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పూజా రెడ్డి, ఎంపీటీసీ భూదేవి, వైద్యులు షాదుల్లా, అంజలి, సాయితేజ, కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాయకూర్‌లో..

రుద్రూర్: కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాయకూర్ గ్రామ సర్పంచ్ బేగరి గంగారాం కోరారు. రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉప సర్పంచ్ గంగారాం, వైద్యురాలు శ్రీలత, ఎంపీటీసీ అనిల్ పటేల్, జీపీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



రెంజల్(బోధన్): నీలా గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయం వద్ద శుక్రవారం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలో గణపతి, పార్వతి, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అంగరంగా వైభవంగా ప్రారంభించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని యజ్ఞం నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



మోర్తాడ్: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువలా సాగింది. గురువారం అర్ధరాత్రి బలిపూజల అనంతరం శుక్రవారం తెల్లవారుజామున వరకు రథోత్సవం మోర్తాడ్ వీధులలో ఘనంగా సాగింది. వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కళ్యాణం ఇతర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు.

హన్మాన్ ఆలయ కమిటీ ఏర్పాటు



రుద్రూర్: మండల కేంద్రంలోని హన్మాన్ ఆలయ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిదుర వీరేశం, ప్రధాన కార్యదర్శిగా ఎముల గజేందర్, ఉపాధ్యక్షుడిగా కర్క అశోక్, ఇందూర్ కార్తీక్, కోశాధికారిగా కందూరి రాజు ఎన్నుకున్నారు. అనంతరం హన్మాన్ మాలధారణ స్వాముల సన్నిధానం నిర్మాణ ప్రణాళిక, భూమి పూజ తదితర కార్యక్రమాలపై చర్చించారు. సన్నిధానం కోసం ఇటీవల అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి రూ.10 లక్షలు మంజూరు చేశారు. సమావేశంలో సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ తోట శంకర్, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, చిదుర వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

అతిథి అధ్యాపకుడికి ఆహ్వానం

బోధన్: బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఆంగ్ల అతిథి అధ్యాపకుడి స్థానం కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రంగారత్నం శుక్రవారం తెలిపారు. పీజీ ఇంగ్లిష్ సబ్జెక్టులో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు పొంది ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్ లేదా సెట్ పాస్ అయిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 13లోపు స్వీకరిస్తామని, కళాశాలలో కామర్స్ లెక్చరర్ వినయ్ కుమార్‌కు అందించాలని సూచించారు. 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వెల్లడించారు.